క్లుప్తంగా

చుండూరు రవిబాబు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని సర్వేరెడ్డిపాలెం గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ ఆంజనేయ విరాట్ విగ్రహం వద్ద ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మ సురేష్, ఆదిశేషయ్య, జాజుల శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షునిగా అన్వేష్



పల్లపాటి అన్వేష్

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం సంతనూతలపాడు నియోజకవర్గ అధ్యక్షునిగా పల్లపాటి అన్వేష్‌ను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ తనకు నియోజవర్గస్థాయి పదవి దక్కడానికి కృషి చేసిన మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆభా కార్డులతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపట్నం: అభా కార్డులతో ఆరోగ్య సమస్యలను త్వరగా గుర్తించడంతో పాటు ప్రాణాలను కాపాడవచ్చని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రకాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో అభా కార్డు గురించి మాట్లాడారు. డాక్టర్ మహేష్ కుమార్, మెడికల్ సిబ్బంది విజయభారతి పాల్గొన్నారు.

వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న యువకులను అడ్డుకున్న అగ్రకులస్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి గ్రామంలో లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చూడాలన్నారు. నిందితులపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌ల కింది కేసు నమోదు చేయాలని కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలి

మద్దిపాడు: మండలంలో బర్లీ పొగాకు సాగుచేసిన రైతులు తమ వద్ద పొగాకు ఉంటే గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కే రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బర్లీ పొగాకు వేసిన రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ క్రమంలో రైతులు తమ వద్ద ఉన్న పంట వివరాలను గ్రామ రైతు సహాయకులకు అందిస్తే వారు సంబంధిత యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: విజయవాడలో జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. గురువారం మార్కాపురంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్ష్య కార్యదర్శులు కె.చెంచిరెడ్డి, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కౌన్సిల్ మహాసభకు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బడేసాహేబ్, కోమలి, ఖాన్, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

- సంతనూతలపాడు నియోజకవర్గంలో ఘనంగా ప్రత్యేక పూజలు
- విశేష అలంకరణలలో దర్శనమిచ్చిన స్వామివారు




మద్దిరాలలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



కూనంనేనివారిపాలెంలోని పూజలందుకుంటున్న ప్రసన్నాంజనేయస్వామి



పేర్నమిట్ట పాల కేంద్రం వద్ద పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి



చీమకుర్తిలో అరటి పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి



చీమకుర్తి హరిహరక్షేత్రంలో ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



చీమకుర్తిలో హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు



చీమకుర్తి గరికమిట్టలో వైఎస్సార్ సీపీ యువకులు నిర్మించిన ప్రభ

సంతనూతలపాడు: హనుమజ్జయంతి వేడుకలను సంతనూతలపాడు నియోజకవర్గంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతనూతలపాడు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుమ్మళంపాడు గ్రామ సమీపంలో నిధి వద్ద తిరునాళ్లు నిర్వహించే ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. మొదట విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అనంతరం స్వామివారికి మన్యుసూక్త, పంచామృతాభిషేకాలు, లక్ష తమలపాకులతో నాగవల్లి దళార్చన, మన్యుసూక్త హోమాలు, సుందరకాండ పారాయణం పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, దాతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సంతనూతలపాడులోని జెండా చెట్టు వద్ద గల వీరాంజనేయస్వామి 15వ వార్షికోత్సవాన్ని గురువారం హనుమత్ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. గత 30 రోజుల నుంచి రాత్రివేళల్లో మహిళలు హనుమాన్ చాలీసా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలచే భజన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం మధ్యాహ్నం యాదవ సంఘం ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గూడా శివరామకృష్ణ బృందం ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సంతనూతలపాడులోని గానుగుపాలెం హైస్కూల్ సమీపంలో గల ఆశ్రమం వద్ద ఆంజనేయస్వామికి నిర్వాహకులు ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సంతనూతలపాడు మండలం పాల కేంద్రం వద్ద గల శ్రీ అభయాంజనేయస్వామికి భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హరిహరక్షేత్రంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. 108 కలశాలతో పవిత్ర గంగాజలాలు తీసుకొచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష నాగవల్లి దళార్చనతో పాటు సామూహిక లలిత సహస్ర నామార్చన నిర్వహించగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత స్వామివారికి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. చీమకుర్తి గరికమిట్ట వద్ద వైఎస్సార్ సీపీ యువకుల ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రభ నిర్మించారు. ఊరేగింపుగా తీసుకొస్తూ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. చీమకుర్తి పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామిని అరటిపండ్లు, ద్రాక్ష పండ్లతో అలంకరించారు. స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూనంనేనివారిపాలెంలో...

చీమకుర్తి రూరల్: హనుమన్ జయంతి వేడుకలను గురువారం మండలంలోని కూనంనేనివారిపాలెంలో గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజారి మంచికలపాటి రవీంద్రశర్మ, ఆలయ కమిటీ కార్యనిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. తమలపాకుల మాల, వడమాలతో స్వామివారిని అలంకరించి ఉదయం 8 గంటల నుంచి భక్తులు, మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. పాటిమీదపాలెం, పల్లామల్లి, బండ్లమూడి, పడమటినాయుడిపాలెం, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.

మద్దిరాల గ్రామంలో మాజీ మంత్రి మేరుగు పూజలు...

నాగులుప్పలపాడు: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని మద్దిరాల గ్రామంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడే మండలంలో పొగాకు పంటను పరిశీలించామని, రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆంజనేయస్వామి అయినా మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు. బర్లీ పొగాకు రైతులు సాగు చేసిన పంటను కొనేవారు లేక గిట్టుబాటు ధర రాక పెట్టిన పెట్టుబడులు, తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు పడుతున్న ఆవేదన అంతాఇంతా కాదన్నారు. పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇంకా పొలాల్లో ఆరబెట్టిన పరిస్థితుల్లో వర్షాలకు పూర్తిగా తడిసి దేనికీ పనికిరాకుండా పోవడం చాలా బాధాకరమన్నారు.

ముక్కోటి దేవతలంతా ఒక్కటై కూటమి ప్రభుత్వానికి, పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించి రైతుల బాధలు తీర్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, నియోజకవర్గం, మండల యూత్ అధ్యక్షులు కందుల దానియేలు, బాలకృష్ణ, ఘట్టమనేని అశోక్, జెట్టి శ్రీనివాసరావు, సుబ్బారావు, తోకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా శ్రీరామ దూత ఆంజనేయస్వామి మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు అర్చక స్వాములు అభిషేకాలు, అర్చనలు చేశారు. సామూహికంగా భక్తులతో రామనామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

కొత్తపట్నం: హనుమాన్ జయంతి వేడుకలు మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. హనుమంతుడుకు ప్రత్యేక అలంకరణ, భజనలు, పాటలు ఆలపించారు. తీర్థ ప్రసాదాలు, పండ్లు, కాయలు పంపిణీ చేశారు, పురోహితులు హనుమంతుడి జీవిత చరిత్ర వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జీవిత చరిత్రను ఆలపించారు.



హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు



పేర్నమిట్ట కాలనీలో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో బారులు తీరిన భక్తులు



చీమకుర్తిలో హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న మహిళలు

చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే సమ్మర్ క్యాంపులు



వేసవి విజ్ఞాన శిబిరంలో తరగతులకు హాజరైన విద్యార్థులు



భగత్‌సింగ్ కాలనీలో శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులతో నిర్వాహకులు

- జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి

ఒంగోలు టౌన్: వేసవి విజ్ఞాన శిబిరాలు చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఎంతో ఉపకరిస్తాయని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ఉన్నత శిఖరాలనధిరోహించేందుకు సహకరిస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి చెప్పారు. గురువారం ఆమె శిక్షణ శిబిరాన్ని సందర్శించి కాసేపు పిల్లలతో ముచ్చటించారు. ఏమేమి నేర్చుకుంటున్నారో చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. కథలు చెప్పడం, చదవడం, పేపర బొమ్మలు తయారు చేయడం, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ నేర్చుకుంటున్నామని పిల్లలు చెప్పడంతో సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఏటా వేసవిలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సమయం వృథా కాకుండా చేయడంతో పాటు వారిలో నిబిడీకతమైవున్న నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్. బిందుమణి, వి.వెంకయ్య, తరుణ్, టి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన భగత్‌సింగ్ చిల్డ్రన్స్ క్యాంపు

నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో భగత్ సింగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 18 రోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంపు గురువారం ముగిసింది. సమ్మర్ క్యాంపులో కాలనీకి చెందిన విద్యార్థులకు ఇంగ్లిష్ చదవడం, రాయడంతో పాటు హ్యాండ్ రైటింగ్, క్రాఫ్టింగ్, డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు డీవైఎఫ్‌ఐ నగర నాయకులు ఉసుపాటి కిరణ్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా శాస్త్రీయ ఆలోచన ధోరణిని అలవరుచుకోవాలని సూచించారు. చదవుతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతి కార్యకలాపాల్లో కూడా రాణించాలన్నారు. సమ్మర్ క్యాంపు నిర్వాహకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కాలనీలో రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబాలు ఉన్నాయని, వారి పిల్లలకు వేసవిలో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. డీవైఎఫ్‌ఐ నాయకులు వంశీధర్, కె.బాబు, వై.దానియేలు, శ్రీనివాసులు, విజయమ్మ, బావనారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడం నమ్మక ద్రోహం

ఒంగోలు టౌన్: ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రజలకు ద్రోహం చేయడమేనని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయ మీటర్లను వ్యతిరేకిస్తూ కోర్టుల్లో కేసులు వేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు వ్యవసాయ మీటర్లను బిగించడం నయవంచన చేయడమేనని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మీటర్లు బిగిస్తే మొబైల్ ఫోన్ రీ చార్జింగ్ చేసినట్లు నెల రోజులు, 3 నెలల గడువు వంటి ప్యాకేజీలతో ముందుగానే డబ్బులు చెల్లించి మీటర్లను రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా ఒక్కో స్మార్ట్ మీటర్ వ్యయం 15 రుపాయలు అవుతుందని, ఆ ఖర్చు కూడా వినియోగదారులే భరించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించారని తెలిపారు. ఆ తరువాత నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, ఇది ప్రజలపై అత్యంత భారం మోపడమేనని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని, దీన్ని ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల బిగించే నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని కోరారు.

భారీ వర్షంతో కోతకు గురైన రోడ్లు

కొనకనమిట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో బుధవారం రాత్రి గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే రోడ్డు, అలాగే వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రహదారి కోతకు గురయ్యాయి. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



గనివానిపాడు-వాగుమడుగు మార్గంలో కోతకు గురైన రోడ్డు

మృతురాలి కుటుంబ సభ్యులకు చుండూరు పరామర్శ



శిరీష కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: ఒంగోలు రూరల్ మండలం పెద దేవరంపాడు గ్రామానికి చెందిన వడ్లమూడి శిరీష ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందారు. మృతురాలు శిరీష కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతురాలు శిరీష పెద్దకర్మ సందర్భంగా శిరీష చిత్రటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన వెంట ఒంగోలు రూరల్ మండలం అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, నాయకులు ఉన్నారు.

భక్తి ద్వారా సర్వపాపాల నిర్మూలన



మాట్లాడుతున్న స్వామిజీ చిదంబరశాస్త్రి

సంతనూతలపాడు: ప్రతిఒక్కరూ భక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా సర్వపాపాలు తొలగిపోతాయని అయోధ్య స్వామీజీ అన్నదానం చిదంబరశాస్త్రి అన్నారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని శ్రీ షిరిడీ సుందరసాయి మందిరంలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి చిదంబరశాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవునికి ఆదిశక్తి మహిమలు ఉంటాయని తెలిపారు. అనంతరం ఆంజనేయస్వామి, సువర్చలాదేవికి కళ్యాణం జరిపించారు. వ్యాఖ్యాతగా వేద పండితుడు పోలూరి శ్రీనివాసులు వ్యవహరించారు.

అనంతరం చిదంబరశాస్త్రిని ఆలయ నిర్వాహకులు హరిప్రసాద్, వాసు, తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో హనుమత్ ఉపాసకులు పేర్నమిట్ట హనుమంతరావు, పలు కేంద్రాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.